క్లుప్తంగా

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం



పీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

కాగజ్‌నగర్‌రూరల్: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్ కుమార్ గౌడ్‌ను సోమవారం నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఇంద్రకరణ్ రెడ్డి, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పలు సన్మానించారు. హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

నీటి సరఫరాపై శిక్షణ

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జీపీ మంచి నీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి నాణ్యత, చేతి పంపులకు మరమ్మతులు, మిషన్ భగీరథ పైప్‌లైన్‌లలో లీకేజీలకు మరమ్మతులు, మోటర్ల రిపేర్ వంటి అంశాలపై డీఈ ఇర్ఫాన్ ప్రాజెక్టర్ ద్వారా శిక్షణ కల్పించారు.

పందులను అరికట్టాలని రాస్తారోకో

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి కార్మిక కాలనీల్లో రోజురోజుకు పెరుగుతున్న పందుల బెడదను అరికట్టాలని కాలనీవాసులు సోమవారం రాత్రి గోలేటిటౌన్‌షిప్‌లోని సింగరేణి బస్టాండ్ వద్ద రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ విపరీతంగా పెరిగిన పందులు కాలనీలో సంచరిస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు.

26న రౌటసంకెపెల్లిలో వైద్య శిబిరం

ఆసిఫాబాద్: ఈ నెల 26న మండలంలోని రౌటసంకెపెల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా పక్వాడ్ జిల్లా ఇన్‌చార్జి అరిగెల నాగేశ్వర్ రావు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకొని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే సేవా పక్వాడ్ కార్యక్రమాల్లో భాగంగా మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల్లో మమేకమై వారి సమస్యలు తెలుసుకునేందుకు బీజేపీ కృషి చేస్తుందన్నారు.

వ్యాసరచన పోటీలు

కాగజ్‌నగర్‌రూరల్: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో సోమవారం మండలంలోని భట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్పీఎం, స్పర్శ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా స్పర్శ సొసైటీ మేనేజర్ రీనా బిల్‌వాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిశుభ్రత, మన పరిసరాలను శుభ్రంగా ఎలా ఉంచుకోవాలి అనే అంశాలపై మాట్లాడారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధాబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్



అనిల్‌కుమార్

రెబ్బెన: పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన చూనార్కర్ అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. కాగజ్‌నగర్‌లోని పద్మశాలిభవన్‌లో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు.

'మెడికల్ కాలేజీకి లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి'

ఆసిఫాబాద్‌రూరల్: మెడికల్ కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు చేయాలని బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మాట్లాడుతూ జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో జన్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర ఉద్యమ పోరాటంలో పాల్గొన్న మహనీయుడన్నారు. నాయకులు సాయి, గణేశ్, బాపూజీ పాల్గొన్నారు.

పాఠశాలకు కొత్త భవనం నిర్మించాలి

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని కోరుతూ సోమవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ మండలంలోని వావుదాం గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండటంతో రైతు వేదికలో తరగతులు నిర్వహించారన్నారు. ప్రస్తుతం గ్రామంలోని జీపీ కార్యాలయంలో తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

తీరనున్న సిగ్నల్ కష్టాలు!

- త్వరలో అందుబాటులోకి బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్
- 11 టవర్ల నిర్మాణం పూర్తి
- అక్టోబర్‌లో ప్రారంభించే అవకాశం



మంగిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్

తిర్యాణి: ఇక మండలంలోని ప్రతీ పల్లెలోనూ సెల్ ఫోన్ మోగనుంది. మండలంలో 90శాతానికి పైగా ఆదివాసీలుండగా వారి గూడేలు ఎక్కువగా దట్టమైనా అటవీ ప్రాంతంలో ఉన్నాయి. అడవిని నమ్ముకొని అటవీ సంపదతో బతికే ఆదివాసీలు అడవికి ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో నివసించేందుకు ఇష్టపడుతుంటారు. కానీ నేటికీ ఆయా ప్రాంతాల్లో సెల్ ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో బయటి ప్రపంచంతో వారికి సంబంధాలు చాలా తక్కుగా ఉంటున్నాయి. ప్రస్తుతానికి మండలంలోని 60శాతం పైగా గ్రామాల్లో నేటికీ మొబైల్ సిగ్నల్స్ లేవు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వ రంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ముందుకొచ్చింది. గత రెండేళ్ల క్రితం మండలంలో 16 టవర్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. వివిధ కారణాలతో 4 టవర్ల నిర్మాణం చేపట్టలేదు. మిగతా 12 టవర్లలో 11 టవర్ల నిర్మాణం పూర్తి కాగా ప్రస్తుతం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. కాగా గోయోగాంలో అటవీ అనుమతులు రాక పనులు పూర్తి కాలేదు.

మారుమూల ప్రాంతాలకూ సిగ్నల్స్..

మండలంలోని సిగ్నల్స్ సమస్యను పరిష్కరించడానికి గతంలో ఓ ప్రైవేట్ నెట్‌వర్క్ సంస్థ మంగి, పంగిడిమాదర గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేసింది. కానీ పూర్తిస్థాయి అనుమతులు రాకపోవడంతో నేటికీ అవి ప్రారంభానికి నోచుకోలేదు. ఈనేపథ్యంలో అక్కడి ఆదివాసీలు అత్యవసర సమయంలో సమాచారం అందించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కోవిడ్ సమయంలోనూ విద్యార్థులు సిగ్నల్స్ అందక ఆన్‌లైన్ పాఠాలు వినలేక విద్యకు దూరమయ్యారు. మారుమూల ప్రాంతాల్లో పనిచేసే అధికారులు సైతం విధులకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వీలు లేక నానా తంటాలు పడుతున్నారు. ఈ సమస్యకు వచ్చే నెలలో చెక్ పడనున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్‌లో వర్చువల్‌గా ప్రధాని నరేంద్ర మోదీ సెల్‌ఫోన్ టవర్లను ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలు టవర్లకు విద్యుత్ సదుపాయంతో పాటు 4జీ సిగ్నల్స్ సెట్ అమర్చారు.

సమస్యలు తీరుతాయి..

మారుమూల ప్రాంతాల్లో ఎలాంటి నెట్‌వర్క్ సిగ్నల్స్ అందుబాటులో లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. నూతనంగా నిర్మించిన బీఎస్ఎన్ఎల్ టవర్లను ప్రారంభిస్తే నెట్‌వర్క్ కష్టాలు తీరుతాయి. మా గ్రామంలో సిగ్నల్స్ లేక అత్యవసర సమయంలో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఫోన్ మాట్లాడానికి కిలో మీటర్ల దూరం వెళ్లి వస్తున్నాం.

– కొట్నాక గణపతి, కొటగం

వచ్చే నెలలో ప్రారంభిస్తాం

మండలంలో నూతనంగా నిర్మించిన టవర్లను వచ్చే నెలలో ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నాం. ఈ నేపథ్యంలో ఇప్పటికే టవర్లు ప్రారంభించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– శ్రీధర్, డీఎం, బీఎస్ఎన్ఎల్, మంచిర్యాల

భావితరాల కోసం పచ్చదనాన్ని పెంపొందించాలి



మొక్కలు నాటుతున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: భావితరాల కోసం పచ్చదనం పెంపొందించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ సంస్థ సీఎండీ బలరాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన ఒక్కరే ఇప్పటి వరకు 16వేల మొక్కలను నాటారని కొనియాడారు. సింగరేణి ఆధ్వర్యంలో జ్యూట్‌బ్యాగులు పంపిణీ చేస్తామన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్వోటూజీఎం రాజమల్లు, కైరిగూడ పీవో నరేందర్, డీజీఎంలు శ్రీనివాస్, కృష్ణమూర్తి, ప్రాజెక్టు ఇంజనీరు వీరన్న, సివిల్ ఎస్ఈ భాషా, మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.

కైరిగూడ ఓసీపీని సందర్శించిన జీఎం

బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీని సోమవారం ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ సందర్శించారు. ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ఓసీపీ అధికారులతో సమావేశమై ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓసీపీ వెస్ట్ వ్యూ పాయింట్ నుంచి ఓసీపీ పని స్థలాలను వీక్షించారు. 2024 –25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై గని అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఎస్వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి



మాట్లాడుతున్న డీపీవో భిక్షపతి

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకం కింద ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని డీపీవో భిక్షపతి అన్నారు. జిల్లా కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీల్లోని తాగునీటి సరఫరా సహాయకులకు నీటి నాణ్యత, చేతిపంపుల మరమ్మతు, భగీరథ పైప్‌లైన్ మరమ్మతు, మోటర్ల రిపేర్లపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా మోటర్లు చెడిపోతే తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ వెంకటపతి, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



దహెగాం: వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు



కౌటాలలో..

దహెగాం: ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు చౌదరి రాజేశ్ అన్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో నిధుల కొరత ఉందని, రోజువారి కార్యకలాపాలు కార్యదర్శుల వేతనాల నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల మండల సంఘం ప్రధాన కార్యదర్శి సుమలత, పంచాయతీ కార్యదర్శులు ప్రణీత్ బాబు, శ్రావణ్‌కుమార్, విజయ్‌కుమార్, లత, శ్రీకాంత్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

కౌటాల: పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో తీవ్ర నిధుల కొరత ఉన్నందున గ్రామ పంచాయతీ రోజువారి కార్యకలాపాలకు పంచాయతీ కార్యదర్శులు జీతం డబ్బులు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడానికి నిధులు లేక పారిశుధ్య పనుల చేపట్టలేకపోతున్నామని తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సోమవారం తెలంగాణ పంచాయతీ స్టేట్ ఫెడరేషన్ మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా పెందూర్ భాస్కర్, గౌరవ అధ్యక్షుడిగా సుబ్బ సాయికృష్ణ, ఉపాధ్యక్షులుగా పుల్‌జలే రమేశ్, గుజ్జ అంజలి, ప్రధాన కార్యదర్శిగా రాంటెంకి సురేశ్, కోశాధికారిగా నికోరె కవిత, సలహాదారులుగా సునీత, అశోక్, మీడియా కన్వీనర్లుగా సాయికృష్ణ, విఠల్, సభ్యులను ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కాగజ్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు



ఆసిఫాబాద్‌రూరల్: ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉపాధ్యాయుల జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకుడు ఇందురావు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో పని వేళలు ఒకే రకంగా ఉండాలని, గురుకుల టీచర్లకు హెల్త్‌కార్డులు, 317 జీవోతో స్థానికత కోల్పోయిన టీచర్లకు సొంత జిల్లా బదిలీ, గెస్ట్, పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 12 నెలల వేతనం, ప్రభుత్వ ఉత్తర్వులు అన్నిటిని యధాతథంగా అన్ని గురుకులాల్లో అమలు చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. హేమంత్ షిండే, రమేశ్, తిరుపతి, గణేశ్, సత్యనారాయణ, దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు వినతి..

కాగజ్‌నగర్‌రూరల్: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు టీఎస్ యూటీఎఫ్ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. టీఎస్ యూటీఎఫ్, గురుకుల జేఏసీ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రెండో దశ పోరాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మాట్లాడుతూ అన్ని యాజమాన్యాల గురుకుల విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని పాఠశాలల పనివేళలు ఒకేరకంగా ఉండాలన్నారు. ఈనెల 28న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. టీఎస్ యూటీఎఫ్ మండల నాయకులు పార్వతి, సంతోష్, సురేందర్, మహేశ్, అనిల్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రెబ్బెన: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి లాభాల్లో బోనస్ ప్రకటించటంపై సంతోషం వ్యక్తం చేస్తూ సోమవారం గోలేటిలోని సివిల్ డిపార్టుమెంట్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సభ్యులు ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికుల కల సాకారమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం రవీందర్, పల్లాస్, పూదరి సాయి, కార్మికులు రాజేష్, శ్రీనివాస్, సంతోష్, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎస్పీ ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో సోమవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు నిమ్మకంటి మహేశ్‌శర్మ తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్పీని శాలువాతో సత్కరించారు. ఆలయ స్థలంపై అన్యాక్రాంతం అవుతుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్థలంపై విచారణ చేపట్టాలని సీఐ సతీశ్‌కుమార్‌ను ఎస్పీ ఆదేశించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గుండా వెంకన్న, డాక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలో సోమవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో తిరుగుతూ కార్యక్రమం ప్రాముఖ్యత వివరించారు. ప్రతీ ఒక్కరు భాగస్వాములుగా ఉండాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో పోషకాహార వారోత్సవాలు

వాంకిడి: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సోమవారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాలు లభించే ఆహార పదార్థాలను ప్రదర్శించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్యకరమైన ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరంతో ఉన్న నలుగురికి మలేరియ పరీక్షలు చేసి, రక్త నమూనాలు సేకరించారు. గ్రామంలో డ్రైడే నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సోనం, టీచర్లు రాజ్‌కుమారి, పొచ్చుబాయి, వీణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పకడ్బందీగా నిర్వహించాలి

బెజ్జూర్: గ్రామాల్లో పారిశుధ్యం పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్పీవో హుమర్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం లోపించకుండా పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జ్వరాల బారిన పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలి

తిర్యాణి: మండలంలోని ఉపాధ్యాయులపై ఈనెల 18న మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన రాయి సెంటర్ జిల్లా సార్మెడీ కుర్సంగ మోతిరాంపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎస్సై మాధవ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కోట్నాక ప్రవీణ్, గెడం జనార్దన్, గోపాలకృష్ణ, యశ్వంత్‌రావు, యాదవ్‌రావు, రత్నమాల తదితరులు ఉన్నారు.

రేపు 'కులగణన' మార్చ్

ఆసిఫాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు ఈ నెల 25న కులగణ కోసం మార్చ్ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మూడు నెలల్లో బీసీ కుల గణన చేపట్టి రిజర్వేషన్లు నిర్ధారించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టు తీర్పును గౌరవించి, సమగ్ర కులగణన కోసం చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి జక్కన్న, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడె మారుతిపటేల్, నాయకులు శంకర్, లహుకుమార్, మధుకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు పునరావాసం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రెబ్బెన: మండలంలోని పాత మాద్వాయిగూడలో నివసిస్తున్న 24 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం తహసీల్దార్ రామ్మోహన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పెద్దవాగు పరిసర ప్రాంతంలో గ్రామం ఉండటంతో వర్షాకాలంలో పెద్దవాగు ఉప్పొంగి వరదనీరు గ్రామంలోకి చేరుతోందన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి పునరావాసం కల్పించి ఆదుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు జుమ్మిడి ఆనంద్, గ్రామస్తులు ఉన్నారు.

లేబర్‌కోడ్ రద్దు చేయాలి

రెబ్బెన: కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసేలా కేంద్రం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల పిలుపు మేరకు గోలేటిలోని సీహెచ్‌పీలో కేంద్రం తీసుకొచ్చిన లేబర్‌కోడ్ పత్రాలను దగ్ధం చేశారు. కార్మికులు నారాయణ, అలీ, గురుప్రసాద్, అజయ్, రమేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విజయ్, మల్లికార్జున్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

బెజ్జూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నిధుల దుర్వినియోగంపై గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి సోమవారం ఫిర్యాదు చేసినట్లు సోమిని కాంప్లెక్స్ హెచ్ఎం భిక్షమయ్య తెలిపారు. 2023– 24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల్లో పరికరాలు కొనకుండానే నిధులు కాజేశారని, దీనిపై విచారణ చేపట్టాలని కోరినట్లు వెల్లడించారు.